క్లుప్తంగా

రహదారుల అభివృద్ధే ధ్యేయం

అంబాజీపేట: గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. మాచవరం శివారు జయంతినగర్ వద్ద జెడ్పీ నిధులు రూ.5 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు నిర్మాణానికి మంగళవారం భూమి పూజ చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ శివారు ప్రాంతాల్లో ప్రజలకు అవసరమయ్యే రహదారులను నిర్మించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో మైలా ఆనందరావు, కోట సత్తిబాబు, గోసంగి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు సూచించిన సన్మార్గంలో నడవాలి



మాకనపాలెంలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

మామిడికుదురు: ఏసుక్రీస్తు సూచించిన సన్మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ సూచించారు. మాకనపాలెం షారోను ప్రార్థనా మందిరంలో మంగళవారం పాస్టర్ ప్రభుదాసు ఆధ్వర్యంలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్సీ పాల్గొన్నారు. అక్కడ ఏర్పాటు చేసిన కేక్ కట్ చేసి క్రిస్మస్ సంబరాలను నిర్వహించారు. సభలో ఇజ్రాయిల్ మాట్లాడుతూ సర్వ మానవాళి క్రిస్మస్ పండగను ఎంతో ఆనందంగా జరుపుకొంటారన్నారు. ప్రతి ఒక్కరూ సోదరభావంతో మెలగాలని ఏసుక్రీస్తు సూచించారని చెప్పారు. కార్యక్రమంలో శెట్టెం సుధాకర్, చేట్ల సత్యనారాయణ, శెట్టెం రమేష్, మంద గాంధీ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

అంబాజీపేట: సమగ్ర శిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని మండల సీఆర్పీలు, కంప్యూటర్ ఆపరేటర్, ఐఆర్టీ లు, పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు ప్రభుత్వాన్ని కోరారు. అంబాజీపేట ఎంఈఓ కార్యాలయం వద్ద డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎంఈఓ కె.వెంకటేశ్వరరావుకు మంగళవారం అందజేశారు. వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలు చెల్లించాలని, సమాన పనికి సమాన వేతనం ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో సీఆర్పీలు, కంప్యూటర్ ఆపరేటర్, ఐఆర్టీలు, పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు పాల్గొన్నారు.

పోతవరంలో న్యూఇయర్ వేడుకలు



పోతవరం పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

పి.గన్నవరం: మండలంలోని పోతవరం ప్రాథమిక పాఠశాలలో మంగళవారం హెచ్‌ఎం కత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. కేకు కట్ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పులపర్తి రాజారావు, పాఠశాల ఉపాధ్యాయులు మల్లికార్జునరావు, ఎండీ ఇస్మాయిల్, జి.శ్రీనివాస్, సీహెచ్ భాగ్య వరలక్ష్మి, ఎస్ఎంసీ చైర్‌పర్సన్ కుసుమ దుర్గ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉపాధి శిక్షణ తరగతులు

పి.గన్నవరం: ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనులను సమర్థవంతంగా పూర్తి చేయాలని ఎంపీడీఓ ఎం.భారతి ఉపాధి మేట్లకు సూచించారు. పి.గన్నవరం క్లస్టర్ కార్యాలయం వద్ద మండలంలోని మేట్లకు రెండు రోజుల పాటు జరగనున్న శిక్షణ తరగతులను మంగళవారం ఆమె ప్రారంభించారు. ఏపీఓ లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మొబైల్ హాజరు, పని కొలతలు తదితర అంశాలపై ఏపీఓ లక్ష్మీనారాయణ అవగాహన కల్పించారు. సఖినేటిపల్లి ఏపీఓ ఎండీ నాగప్రసాద్, పీవీ రమణ, విజయారెడ్డి, రజని, ఉమా వరలక్ష్మి, ఫీల్డు అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ కనెక్షన్ల పంపిణీ

పి.గన్నవరం: ప్రధాని నరేంద్రమోదీ పేదలకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు అందిస్తున్నారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీ వేమా అన్నారు. పీఎం ఉజ్వల యోజనలో భాగంగా మండలంలోని ముంగండలో 70 మంది లబ్ధిదారులకు మంగళవారం ఆయన గ్యాస్ కనెక్షన్లను అందజేశారు. ఎంపీడీఓ ఎం.భారతి పర్యవేక్షణ లో సర్పంచ్ కుసుమ చంద్రకళ అధ్యక్షతన జరిగి న సమావేశంలో ఆయన మాట్లాడారు. పలువురికి ఆయుష్మాన్ భారత్ కార్డులు పంపిణీ చేశారు. జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు చెరుకూరి గోపాలకృష్ణ, మండల శాఖ అధ్యక్షుడు వై.సాయిబాబు, ఎస్సీ మోర్చా జోనల్ ఇన్‌చార్జి కె.సూర్యారావు, జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ చీకురుమిల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా నరేంద్రపురంలో సర్పంచ్ బీర వెంగమాంబ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అయ్యాజీవేమా మాట్లాడారు. ఎంపీటీసీ కొక్కిరి లక్ష్మి, తిక్కా సత్యనారాయణ, అడ్డాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



చెముడులంకలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఇస్రో మాజీ శాస్త్రవేత్త శివప్రసాద్, ప్రజా ప్రతినిధులు



అంబాజీపేటలో సైన్స్ ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ



లక్కవరంలో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న జెడ్పీటీసీ ప్రసన్నకుమారి



పి.గన్నవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రాజెక్ట్ ప్రదర్శన

నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలి

- పాఠశాలల్లో విద్య, వైజ్ఞానిక ప్రదర్శనలు
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

అంబాజీపేట: విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో ఎంఈఓ కె.వెంకటేశ్వరరావు అధ్యక్షతన మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌ను మంగళవారం నిర్వహించారు. ఎంపీపీ, జెడ్పీటీసీ మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకత పెరగడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయన్నారు. విద్యార్థులు రూపొందించిన పర్యావరణ హిత పరికరాలను, గణిత నమూనాలను, విద్యుత్ పరికరాలను పరిశీలించి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, ఎంపీటీసీల మండల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, హెచ్‌ఎం కడలి సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేటలో..

కొత్తపేట: స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. మండలంలో 12 ఉన్నత, 2 యూపీ పాఠశాలల నుంచి స్టూడెంట్స్ వ్యక్తిగత, స్టూడెంట్ గ్రూపు, టీచర్స్ ఎగ్జిబిట్స్‌ను 5 యూనిట్స్‌గా ప్రదర్శించారు. ఈ ఎగ్జిబిషన్‌ను ఎంపీపీ గంగాధరరావు ప్రారంభించారు. వివిధ విభాగాలను స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రారంభించారు. ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో ఎంపీపీ మార్గన ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ సైన్స్ జీవితంలో ఓ భాగమని, ప్రతి విద్యార్థి మెదడుకు పదునుపెట్టడం ద్వారా శాస్త్ర పరిజ్ఞానాన్ని అలవర్చుకుని సైన్స్ ప్రాజెక్టులు రూపొందించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ముత్యాల వీరభద్రరావు, ఎంపీటీసీ చావలి సుబ్బరాయశాస్త్రి, ఎంఈఓ-2 కె.లీలావతి, ఎగ్జిబిషన్ అబ్జర్వర్స్‌గా ఎస్ఎస్ఏ నుంచి ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ డి.రమేష్‌బాబు, ఏపీఓ డాక్టర్ ఎంకేకే భీమారావు, స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాల పీఎంసీ చైర్మన్ ములపర్తి శ్రీనివాసరావు, హెచ్‌ఎం, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, సైన్స్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



మామిడికుదురులో వైజ్ఞానిక ప్రదర్శనను తిలకిస్తున్న ఎంఈఓ లక్ష్మీనారాయణ

లక్కవరంలో..

మలికిపురం: విద్య, వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని జెడ్పీటీసీ బల్ల ప్రసన్నకుమారి పేర్కొన్నారు. మలికిపురం మండలం లక్కవరం జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద సోమవారం జరిగిన మలికిపురం మండల స్థాయి విద్య వైజ్ఞానిక ప్రదర్శన (2023-24)లో ఆమె పాల్గొని మాట్లాడారు. స్టూడెంట్స్ ఏర్పాటు చేసిన సైన్స్, వైద్య, వివిధ నూతన ప్రదర్శలను సందర్శించారు. అనంతరం ఉత్తమ ప్రదర్శనలు ఇచ్చిన స్టూడెంట్స్‌కి సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ విజయశ్రీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: స్థానిక శింగంశెట్టి ప్రభావతి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి సైన్స్ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. 13 జెడ్పీ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు 150 సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. వీటిలో ఐదు ప్రాజెక్టులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యాయని హెచ్‌ఎం డీఎస్‌వీ ప్రసాద్ తెలిపారు. ఎస్ఎస్ఏ అధికారులు ఎంఏకే భీమారావు, బి.సురేష్‌లు ఈ ప్రదర్శనలను పరిశీలించారు. ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

రాజోలులో..

రాజోలు: విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలతో నూతన ఆవిష్కరణలను సృష్టించవచ్చని జెడ్పీటీసీ మట్టా శైలజ అన్నారు. మంగళవారం రాజోలు బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను ఆమె ప్రారంభించారు. భౌతిక, రసాయన, గణిత, ఖగోళ, పర్యావరణ, జీవ శాస్త్రాలు, ఇంజినీరింగ్ అంశాలకు చెందిన రూపాలను ప్రదర్శించారు. ప్రదర్శనల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఎంపీటీసీలు చెల్లింగి లక్ష్మీఈశ్వరి, కొపనాతి పుష్పలత, ఎంఈఓ నల్లి మనోహరం, హెచ్‌ఎం కె.సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరులో..

ఆలమూరు: విద్యార్థుల్లో ప్రతిభ వెలికితీసేందుకే ప్రభుత్వం విద్య, వైజ్ఞానిక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తుందని ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతా మహాలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు అన్నారు. చెముడులంక ఎస్టీఏస్ఎన్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో సర్పంచ్ తమ్మన శ్రీనివాసు అధ్యక్షతన మంగళవారం విద్యా వైజ్ఞానిక ప్రదర్శన జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా ఇస్రో మాజీ శాస్త్రవేత్త యాళ్ల శివప్రసాద్ విచ్చేసి సైన్స్ ద్వారా మానవాళికి అందుతున్న సేవలను వివరించారు. విద్యా వైజ్ఞానిక పోటీల్లో అత్యుత్తమ ప్రతిభను కనబర్చిన విద్యార్థులు, ఉపాధ్యాయులందరికి సర్పంచ్ తమ్మన ఆధ్వర్యంలో ప్రజా ప్రతినిధుల బృంద సభ్యులు బహుమతులను అందజేశారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శన చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. మండలంలోని 13 ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. వ్యక్తిగత విభాగంలో మామిడికుదురు ఉన్నత పాఠశాలకు చెందిన కేపీఎస్ఎస్ శ్రీరామ్, గ్రూపు విభాగంలో మొగలికుదురు ఉన్నత పాఠశాలకు చెందిన వి.రామమూర్తి, వి.ఉదయ్‌కిరణ్, టీచర్ వ్యక్తిగత విభాగంలో అప్పనపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన కె.మహాలక్ష్మి, అటల్‌ల్యాబ్ విభాగంలో మొగలికుదురుకు చెందిన టి.అఖిల్ జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఎంఈఓలు ఎస్.లక్ష్మీనారాయణ, మోకా వెంకన్నబాబు, ఎ.పద్మశ్రీ, బి.రఘురామ్, ఎ.సత్యకిరణ్, హెచ్‌ఎం సీహెచ్ నిరంజని పాల్గొన్నారు.

ముక్తేశ్వరంలో..

అయినవిల్లి: విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం పెంపొందించుకోవాలని ఎంపీపీ మట్టపర్తి నాగ విజయలక్ష్మి, ఎంఈఓ జేకేదుర్గ అన్నారు. మంగళవారం ఎంపీపీ మట్టపర్తి నాగ విజయలక్ష్మి ఆధ్వర్యంలో స్థానిక ముక్తేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో మండలంలోని 11 జెడ్పీ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. వీరిని పలు పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

రామేశ్వరంలో..

సఖినేటిపల్లి: మండలంలోని రామేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యా వైజ్ఞానిక ప్రదర్శన జరిగింది. మండలంలోని 14 పాఠశాలల నుంచి వ్యక్తిగత, గ్రూపు, టీచర్ విభాగాల నుంచి 40 ప్రాజెక్టులను ఇందులో ప్రదర్శించారు. మండల విద్యాశాఖ సర్టిఫికెట్స్ అందజేసింది. జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, ఎంపీటీసీ దొండపాటి సునీత, ఎంఈఓ డి.కిషోర్‌కుమార్, హెచ్‌ఎం ఎంజీకే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలోనే రాష్ట్రం సుభిక్షం

గ్రామాల్లో వై ఏపీ నీడ్స్ జగన్

అంబాజీపేట: రాష్ట్రం జగనన్న పాలనలోనే సుభిక్షంగా ఉందని మండల జేసీఎస్ కన్వీనర్, సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, వైఎస్సార్ సీపీ నాయకుడు వాసంశెట్టి పెదబాబు అన్నారు. వక్కలంకలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని సర్పంచ్ వాసంశెట్టి రేవతి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. గ్రామంలో అభివృద్ధి వివరాల బోర్డును, పార్టీ జెండాను ఆవిష్కరించారు. వాసంశెట్టి పెదబాబు ఇంటి వద్ద నాలుగున్నరేళ్ల జగనన్న పాలనలో ప్రతీ ఇంటికీ జరిగిన మేలును ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో జనుపల్లి ఏడుకొండలు పిల్లి రమేష్, ముత్తాబత్తుల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

పెదపట్నంలో..

మామిడికుదురు: పెదపట్నంలో అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం రూ.24.68 కోట్లు కేటాయించిందని వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము పేర్కొన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం మంగళవారం పెదపట్నంలో జరిగింది. సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన డిస్ ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో రాము మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా గ్రామంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు నిధులు కేటాయించిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. వైఎస్సార్ సీపీ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జేసీఎస్ ఇన్‌చార్జి జక్కంపూడి వాసు, సర్పంచ్ గుబ్బల దుర్గ, ఎంపీటీసీ కడలి పద్మ, తేతల మోహనరెడ్డి, కొమ్ముల చిన్న తదితరులు పాల్గొన్నారు.



పి.గన్నవరంలో అభివృద్ధి పనుల డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు



పెదపట్నంలో వైఎస్సార్ సీపీ పతాకావిష్కరణలో పాల్గొన్న పార్టీ శ్రేణులు

వాడపాలెంలో

కొత్తపేట: మండలంలోని వాడపాలెం గ్రామ సచివాలయం-2 పరిధిలో మంగళవారం సాయంత్రం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌చార్జ్ ఈఓపీఆర్‌డీ సుంకర రెడ్డినాయుడు అధ్యక్షతన జరిగిన సభలో ఎంపీపీ గంగాధరరావు, మండల పార్టీ కన్వీనర్ ముత్యాల వీరభద్రరావు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ముందుగా పార్టీ పతాకాన్ని ఎంపీపీ ఆవిష్కరించారు. అనంతరం సచివాలయం పరిధిలో ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ), పరోక్ష ప్రయోజనాలు (నాన్ డీబీటీ) కింద మొత్తం సుమారు రూ.7 కోట్ల లబ్ధిని ఆయా పథకాల వారీగా డిస్‌ప్లే చేయగా ఎంపీపీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బండారు కృష్ణమూర్తి, గ్రామ శాఖ అధ్యక్షుడు మట్టా బాబ్జి, ఎంఎఎస్ఎం చైర్మన్ పెదపూడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: మండల జేసీఎస్ కన్వీనర్ దొమ్మేటి దుర్గారావు ఆధ్వర్యాన మంగళవారం పి.గన్నవరం-2 సచివాలయం పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. నాయకులు దూనబోయిన అనంతలక్ష్మి, పితాని నర్సింహారావులు అభివృద్ధి పనుల డిజిటల్ బోర్డును, పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. రాష్ట్ర నాయకుడు అడ్డగళ్ల వెంకట సాయిరామ్ మాట్లాడుతూ స్థానిక సచివాలయం-2 పరిధిలో డీబీటీ, నాన్ డీబీటీల ద్వారా ఇంతవరకూ రూ.23 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసిందని వివరించారు. పార్టీ నాయకులు కొండేటి నాని, అడ్డగళ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీకి సర్వం సిద్ధం

ఆలమూరు: దేశ చరిత్రలోనే వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25 లక్షలకు పెంచి అందరికీ ఉచిత వైద్యాన్ని అందజేసేందుకు రూపొందించిన అధునాతన కార్డుల పంపిణీకి సర్వం సిద్ధం చేసినట్లు ఎంపీడీఓ కె.జాన్‌లింకన్, వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి తెలిపారు. వారు మాట్లాడుతూ మండలంలోని 16,665 ఆరోగ్యశ్రీ కార్డులు మంజూరయ్యాయన్నారు. తొలివిడతలో 1728 కార్డులు, మలివిడతలో 15,457 కార్డులు మండలానికి చేరుకున్నాయన్నారు. వీటన్నింటినీ ఆయా సచివాలయాల ఆరోగ్య సిబ్బందికి అందజేశామన్నారు. అలాగే వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ఉపయోగించుకునే విధానాన్ని వివరించేందుకు ఒక బ్రోచర్‌తో పాటు ఆరోగ్యశ్రీ యాప్‌ను అందుబాటులోకి తీసుకువస్తామని వారు పేర్కొన్నారు.

అభివృద్ధికి పెద్దపీట


రావులపాలెం: రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మంగళవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. స్థానిక ఊబలంక రోడ్డులోని అమలాపురం-బొబ్బర్లంక రహదారికి రావులపాలెం నుంచి మెర్లపాలెం వరకు రూ.4 కోట్లతో చేపట్టనున్న రోడ్డు పటిష్ట పరిచే పనులకు శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అలాగే గడప గడపకు మన ప్రభుత్వం, గ్రామ పంచాయతీ, మండల పరిషత్ నిధులు రూ.కోటి 40 లక్షలతో చేపట్టనున్న డ్రెయిన్ పనులకు స్థానిక ఇందిరా కాలనీ రోడ్డులో ఉన్న డ్రెయిన్ నిర్మాణ పనులకు ప్రభుత్వ విప్, చిర్ల జగ్గిరెడ్డి స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, ప్రజలతో కలిసి శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు గాలికి వదిలేసిన అనేక రోడ్లను నిర్మించామన్నారు. మరికొన్ని రోడ్లు నిర్మాణంలో ఉన్నాయన్నారు. అలాగే నియోజకవర్గంలో వివిధ పార్కులు నిర్మిస్తున్నామన్నారు. ప్రజల వద్దకే పరిపాలన అందించాలనే దృఢ సంకల్పంతో ప్రతి గ్రామంలో వివిధ ప్రభుత్వ భవనాలను నిర్మిస్తూ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ బొక్కా ప్రసాద్, సర్పంచ్ తాడేపల్లి నాగమణి, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సాకా ప్రసన్నకుమార్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కర్రి వీర్రెడ్డి, వైఎస్సార్ సీపీ గ్రామపార్టీ అధ్యక్షుడు కర్రి అశోక్‌రెడ్డి, సీఆర్‌సీ అధ్యక్షుడు తాడి నాగమోహనరెడ్డి, కాంట్రాక్టర్ కర్రి తాతారెడ్డి, జేఈ మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఊబలంక-రావులపాలెం రోడ్డుకు శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

ఆలమూరు: రాబోయే సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఓటర్లందరూ ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (ఈవీఎం) ద్వారా జరిపే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని కొత్తపేట ఆర్డీవో ఎం.ముక్కంటి తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండలంలోని చొప్పెల్ల, జొన్నాడ గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల వద్ద ఈవీఎంలపై అవగాహన సదస్సు జరిగింది. తహసీల్దార్ ఐపీ శెట్టి ఆధ్వర్యంలో సర్పంచ్‌లు దంగేటి చంద్రకళ, కట్టా శ్రీనివాసు అధ్యక్షతన నిర్వహించే అవగాహన సదస్సులను ఆర్డీవో ముక్కంటి పరిశీలించారు. ప్రజలు లేవనెత్తిన సందేహాలను బూత్ లెవెల్ కమిటీ అధికారులు నివృత్తి చేశారు. ఈవీఎంలో 15 మంది అభ్యర్థులతో కూడిన ఈవీఎం ఓటర్లకు అందుబాటులో ఉంటుందన్నారు. ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, ఉప సర్పంచ్‌లు నాంద్ర నాగమోహన్‌రెడ్డి, తోరాటి దుర్గారావు, కార్యదర్శులు కె.శ్యామ్‌సుందర్, సీహెచ్ వీరమాత పాల్గొన్నారు.



చొప్పెల్లలో ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న రెవెన్యూ అధికారులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



ర్యాలిలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆత్రేయపురం: అర్హులందరికీ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించడానికే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆత్రేయపురం మండలం ర్యాలిలో గురువారం సాయంత్రం జెడ్పీటీసీ బోణం సాయిబాబు, పార్టీ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ కప్పల శ్రీధర్, రూరల్ బ్యాంక్ అధ్యక్షులు పేర్చేర్ల కృష్ణంరాజు, కోఆప్షన్ మెంబర్ పీఎస్‌రెడ్డి జయపాల్, జగన్మోహినీ కేశవస్వామి మాజీ చైర్మన్ పెన్మెత్స సత్యనారాయణరాజు, వాడపల్లి దేవస్థానం డైరెక్టర్ మెర్ల వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ ఈలి శ్రీరామచంద్రమూర్తి వైఎస్సార్ సీపీ శ్రేణుల ఆధ్వర్యంలో నియోజకవర్గంలో ప్రజా ప్రతినిధులతో పాటు సంబంధిత అధికారులతో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ప్రజలు పలు సమస్యలు ఏకరవు పెట్టారు డ్రైనేజీ, ఇళ్ల స్థలాలు, కాలనీ ఇళ్లు తదితర సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన స్పందించి ఆయా శాఖల అధికారులకు సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. గడప గడపకూ వెళ్లి ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందుతున్న తీరును ప్రజలకు వివరించి సలహాలు, సూచనలు తీసుకున్నారు. సీఎం జగన్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు, ఎంపీపీ కుండ అన్నపూర్ణ, ఎంపీడీవో నాతిబుజ్జి తదితరులు పాల్గొన్నారు.

తాటాకిల్లు దగ్ధం

అయినవిల్లి: పోతుకుర్రులో సోమవారం రాత్రి అగ్నికి ఓ తాటాకిల్లు కాలిబూడిదైంది. దీనికి సంబంధించి అగ్నిమాపక సిబ్బంది, రెవెన్యూ అధికారులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పోతుకుర్రుకి చెందిన కుడుపూడి సత్యనారాయణ తాటాకిల్లు షార్ట్ సర్క్యూట్ కారణంగా కాలి బూడిదైందన్నారు. ముమ్మిడివరం అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రూ.లక్ష ఆస్తినష్టం వాటిల్లినట్లు తెలిపారు. ఆర్ఐ శివార్జున్, వీఆర్వో బాధితునికి 20 కేజీల బియ్యం ప్రభుత్వ సాయం అందజేశారు.